సంపుటి :02 సంచిక :153 పేజీలు :04 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people



## బీసీ బిల్లులపై మోదీ, అమిత్ షా కుట్రలు

- ❖ రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కు అడ్డంకులు
- ❖ నాతో పాటు మంత్రివర్గం ఎదురుచూస్తున్నది..
- ❖ బీజేపీ బీసీల ద్రోహిగా మిగిలిపోతుంది..
- ❖ ఢిల్లీ మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

02

గురువారం 07, ఆగస్టు 2025

## వచ్చే ఎన్నికల్లో మాదే అధికారం

- ❖ కాంగ్రెస్ పాలన మరో రెండున్నరేళ్లే..
- ❖ ఈ ప్రభుత్వంలో రైతులు మళ్లీ రోడ్డెక్కారు..
- ❖ రైతులు ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఉన్నారు..
- ❖ బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

02






# గులాబీ | చుట్టూ ముండ్లు

## రాజకీయ సంక్షోభంలో బీఆర్ఎస్

- తనతో పాటు హరీశ్‌రావు మెడకు 'కాళేశ్వరం' ఉచ్చు
- ప్రాజెక్ట్ కుంగుబాటుకు కేసీఆరే కారణమని తేల్చిన కమిషన్ నివేదిక
- త్వరలో అసెంబ్లీలో నివేదికపై చర్చ
- కొరకరాని కొయ్యలా ఫాన్ ట్యాపింగ్, ఈ ఫార్ములా కేసులు
- ఎమ్మెల్సీ కవిత వేరు కుంపటి, పార్టీ నుంచి వలసల పీడ
- పార్టీ అధినేత కేసీఆర్ ఎదుట ఎన్నో సవాళ్లు

02

తెలంగాణ వచ్చిన తర్వాత రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నది. పార్టీ అధినేత కేసీఆర్, కీలక నేత హరీశ్‌రావు కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిధిలో అవకతవకలు, బరాజ్‌ల కుంగుబాటుపై ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆరోపణల నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం నియమించిన కాళేశ్వరం కమిషన్ ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. దీనిపై ఇప్పటికే క్యాబినేట్ సమావేశం జరిగింది. త్వరలో నివేదికపై అసెంబ్లీలో కూడా చర్చ జరుగనున్నది. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పైకి ధైర్యంగా ఉన్నట్టు వ్యాఖ్యలు చేస్తున్నప్పటికీ, లోలోపల ఉక్కిరి బిక్కిరి అవుతున్నట్లు పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. ఇవన్నీ కాక.. అధినేత కేసీఆర్ తనయ, ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత వేరు కుంపటి పెట్టకున్నట్లు ఆమె కార్యాచారణ చూస్తే స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. మరోవైపు పార్టీ నుంచి మరో పార్టీలోకి వలసలు కూడా మొదలయ్యాయి. ఈపరిణామాలన్నీ అంతర్గత విభేదాలు, కార్యకర్తలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వీటి నేపథ్యంలో బీఆర్ఎస్ కష్టకాలం ఎదురైందని, అధినేత కేసీఆర్ నాయకత్వంపై ఒత్తిడి పెరుగుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

- అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

## "నేను మోనార్కుని, నన్నెవరేం చేయలేరు!"

### కాళేశ్వరం దేవస్థానంలో పాతుకుపోయిన ఆ ఉద్యోగి

- ❖ ప్రభుత్వాలు మారుతున్నా మారని ఉద్యోగి తీరు
- ❖ లడ్డూల తయారీలోనూ చేతివాటం ప్రదర్శన
- ❖ పుష్కరాల సమయంలో లడ్డూ విక్రయాల్లో గోల్ మాల్

03



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ముక్తీశ్వరాలయంలో ఓ ఉద్యోగిపై తీవ్ర అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత 30 ఏళ్లుగా దేవస్థానంలో పాతుకుపోయిన ఆ ఉద్యోగి తీరుపై భక్తులు, స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆ ఉద్యోగి తాను "మోనార్కుని" అని, తననెవరూ ఏమీ చేయలేరని బహిరంగంగా రంకెలు వేస్తున్నట్లు సమాచారం. తనకు ప్రభుత్వంలోని పెద్దల అండదండలు ఉన్నాయని, ఉన్నతాధికారుల సంపూర్ణ సహకారం ఉందని చెప్పుకుంటున్నాడు. తనపై మీడియాలో వచ్చే వార్తలను తేలికగా తీసుకుంటూ, తాను ఓ "సెలబ్రిటీని" కాబట్టే వార్తలు వస్తున్నాయని ప్రచారం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

– అక్షర దర్బార్, కాటారం

# వచ్చే ఎన్నికల్లో మాదే అధికారం

- ❖ కాంగ్రెస్ పాలన మరో రెండున్నరేళ్లే..
- ❖ ఈ ప్రభుత్వంలో రైతులు మళ్లీ రోడ్డెక్కారు..
- ❖ రైతులు ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఉన్నారు..
- ❖ బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

అక్షరదర్బార్, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ ఎస్దే అధికారమని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు అందరి లెక్కలు సరిచేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలో ఉండేది మరో రెండున్నరేళ్లు మాత్రమేనన్నారు. హైదరాబాద్లోని తెలంగాణ భవన్లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పాలనలో అందరికీ న్యాయం జరిగిందని, కాంగ్రెస్ పాలనలో మాత్రం భూములు విలువలు పడిపోయాయని, యూరియా కోసం మళ్లీ రైతులు కష్టపడాల్సి వస్తుందన్నారు. పదేళ్లలో రేషన్ కార్డులు ఇవ్వలేదని ఐఏఎస్ అధికారులు అబద్ధాలు చెబుతున్నారని, ఐఏఎస్లు రాజకీయాలు మాట్లాడటం సరికాదని హితవు పలికారు. రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఓట్లు ఉన్నప్పుడు కాదు, ప్రభుత్వం నాట్లు వేసేటప్పుడు రైతులకు రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిశాక ప్రభుత్వం రైతుబంధు నిలిపివేస్తుందని జోస్యం చెప్పారు. ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు పెట్టి బీసీ సబ్ప్లాన్ను ప్రవేశపెట్టాలని కోరారు. సీఎం రేవంత్రెడ్డికి బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ అంటే భయం పట్టుకుందని, అందుకే ఢిల్లీలో కూడా ఆయన్నే విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు.


# బీసీ బిల్లులపై మోదీ, అమిత్ షా కుట్రలు

- ❖ రాష్ట్రపతి అపాయింట్మెంట్ కు అడ్డంకులు
- ❖ నాతో పాటు మంత్రివర్గం ఎదురుచూస్తున్నది..
- ❖ బీజేపీ బీసీల ద్రోహిగా మిగిలిపోతుంది..
- ❖ ఢిల్లీ మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

అక్షరదర్బార్, ఢిల్లీ: తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనపై తమ ప్రభుత్వం రూపొందించిన బిల్లులపై ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా కుట్రలు పన్నుతున్నారని, దీనిలో భాగంగానే తమకు రాష్ట్రపతి అపాయింట్మెంట్ కూడా దొరక్కుండా అడ్డుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రివర్గం మొత్తం రాష్ట్రపతి అపాయింట్మెంట్ కోసం ఎదురుచూస్తున్నా అవకాశం ఇవ్వకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్గాంధీ ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది ఫిబ్రవరిలో కులగణన చేపట్టి, ఆ లెక్కల ప్రకారమే బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించామని, ఈ బిల్లులను ఆమోదం కోసం రాష్ట్రపతికి పంపామని గుర్తుచేశారు. రిజర్వేషన్లపై పోరాడేందుకే గల్లీ నుంచి దిల్లీకి వచ్చామని, జంతర్ మంతర్ వద్ద మహా ధర్నా నిర్వహించి కేంద్రాన్ని నిలదీశామని స్పష్టం చేశారు. ముస్లిం రిజర్వేషన్ల సాకు చూపి ఓబీసీ రిజర్వేషన్లను అడ్డుకోవాలని బీజేపీ చూస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ను దెబ్బ తీయాలనే దురుద్దేశంతో బీజేపీతో కలిసి బీఆర్ఎస్ అంటకాగుతోందని ఆరోపించారు. కేంద్రం తప్పిదాలను బీఆర్ఎస్ నేతలు ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. తమ ధర్నాలో బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీలు పాల్గొనకపోగా, తమను అవహేళన చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా బీజేపీ బిల్లులకు ఆమోదం తెలపాలని, లేదంటే క్షేత్ర స్థాయిలో ప్రజలతో తగిన గుణపాఠం చెప్పిస్తామని హెచ్చరించారు.



# గులాబీ చుట్టూ ముండ్లు




## రాజకీయ సంక్షోభంలో బీఆర్ఎస్

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

తెలంగాణ వచ్చిన తర్వాత రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నది. పార్టీ అధినేత కేసీఆర్, కీలక నేత హరీశ్రావు కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిధిలో అవకతవకలు, బరాజ్ల కుంగుబాటుపై ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆరోపణల నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం నియమించిన కాళేశ్వరం కమిషన్ ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. దీనిపై ఇప్పటికే క్యాబినేట్ సమావేశం జరిగింది. త్వరలో నివేదికపై అసెంబ్లీలో కూడా చర్చ జరుగనున్నది. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పైకి ధైర్యంగా ఉన్నట్టు వ్యాఖ్యలు చేస్తున్నప్పటికీ, లోలోపల ఉక్కిరి బిక్కిరి అవుతున్నట్లు పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. ఇవన్నీ కాక.. అధినేత కేసీఆర్ తనయ, ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత వేరు కుంపటి పెట్టకున్నట్లు ఆమె కార్యాచారణ చూస్తే స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. మరోవైపు పార్టీ నుంచి మరో పార్టీలోకి వలసలు కూడా మొదలయ్యాయి. ఈపరిణామాలన్నీ అంతర్గత విభేదాలు, కార్యకర్తలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వీటి నేపథ్యంలో బీఆర్ఎస్ కష్టకాలం ఎదురైందని, అధినేత కేసీఆర్ నాయకత్వంపై ఒత్తిడి పెరుగుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### కాళేశ్వరం నివేదిక రచ్చ..



బీఆర్ఎస్ హయంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ తర్వాత కుంగుబాటుకు గురికావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అంశాన్ని పట్టుకున్నది. ప్రాజెక్ట్ నిర్మాణంలో నాణ్యత లోపాలు ఉన్నాయని, భారీగా నిధులు దుర్వినియోగమయ్యాయని ప్రభుత్వం ఆరోపించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నియమించింది. నాటి సీఎం కేసీఆర్, నాటి మంత్రులు హరీశ్రావు, ఈటల రాజేందర్తో పాటు వంద మందికి పైగా అధికారులు, ఇంజినీర్లను కమిషన్ విచారించింది. వారి వాంగ్మూలాలు రికార్డు చేసింది. ఇటీవల ప్రభుత్వానికి ఆ నివేదికను అందజేసింది. ప్రాజెక్టు వ్యయం రూ.1.47 లక్షల కోట్లకు పైగా పెరగడంపై కమిషన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రాజెక్టు అంచనాలను ఇష్టానుసారం పెంచి, ప్రజల డబ్బును దుర్వినియోగం చేశారని ఆరోపించింది. ప్రాజెక్టు డిజైన్, నిర్మాణానికి సంబంధించి అనేక కీలక నిర్ణయాలను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తన వ్యక్తిగత నిర్ణయంగా తీసుకున్నారని, క్యాబినెట్ అనుమతి తీసుకోలేదని నివేదిక పేర్కొంది. ఇది ప్రభుత్వ పాలనా నియమాలకు విరుద్ధమని కమిషన్ అభిప్రాయపడింది. డిజైన్, నిర్మాణ లోపాలు: ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో లోపాలున్నాయని, అందుకే అవి దెబ్బతిన్నాయని కమిషన్ తేల్చి చెప్పింది. 650 పేజీల నివేదికలో ప్రభుత్వం ఎంపిక చేసిన కొన్ని అంశాలను మాత్రమే బయటపెట్టింది. కాళేశ్వరం కుంగుబాటును బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతికి నిదర్శనంగా చూపి, ప్రజల మద్దతు కూడగట్టాలని చూస్తోంది. నివేదికను అసెంబ్లీలో చర్చకు పెడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా ప్రకటించారు. వాటన్నింటినీ ఎదుర్కోవాలంటే బీఆర్ఎస్కు పెద్ద సవాల్ అన్నమాటే.

- ❖ తనతో పాటు హరీశ్రావు మెడకు 'కాళేశ్వరం' ఉచ్చు
- ❖ ప్రాజెక్ట్ కుంగుబాటుకు కేసీఆరే కారణమని తేల్చిన కమిషన్ నివేదిక
- ❖ త్వరలో అసెంబ్లీలో నివేదికపై చర్చ
- ❖ కొరకరాని కొయ్యలా ఫోన్ ట్యాపింగ్, ఈ ఫార్ములా కేసులు
- ❖ ఎమ్మెల్సీ కవిత వేరు కుంపటి, పార్టీ నుంచి వలసల పీడ
- ❖ పార్టీ అధినేత కేసీఆర్ ఎదుట ఎన్నో సవాళ్లు

**-- వలసల తలనొప్పి..**

ఎన్నికల్లో ఓటమి తరువాత బీఆర్ఎస్ పార్టీ నుండి ఇతర పార్టీలకు వలసలు పెరగడం పార్టీకి మరో పెద్ద సమస్యగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ఆశించిన ఫలితాలను సాధించకపోవడంతో, పలువురు ముఖ్య నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర పార్టీల్లో చేరడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే బీజేపీ రాష్ట్రంలో ఆపరేషన్ ఆకర్ష్ ను ప్రారంభించినట్లు కనిపిస్తోంది. ఇప్పటికే అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పార్టీని వీడారు. త్వరలో ఆయన బీజేపీలో చేరబోతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహం సైతం అదేబాటలో ఉన్నట్లుగా ప్రచారం జరుగుతున్నది. వీరితో పాటు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యేలు, కీలక నేతలు 10 మంది వరకు బీజేపీ నేతలతో టచ్లో ఉన్నట్లు విస్తృతమైన ప్రచారం నడుస్తోంది. గతంలో ఆపరేషన్ ఫాంహౌస్ లో కనిపించిన అప్పటి ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, హర్షవర్ధన్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి కూడా బీజేపీలో చేరే వారి జాబితాలో ఉన్నట్లుగా గుసగుసలు వినపడుతున్నాయి.



### కవిత వేరు కుంపటి..



ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవిత అరెస్ట్ కావడం, ఆమె జైలులో ఉండటం నాడు బీఆర్ఎస్ కు క్లిష్టమైన సమస్యగా ఉండేది. ఒక పార్టీ అధినేత కేసీఆర్ కుమార్తె కేంద్ర దర్యాప్తు సంస్థల విచారణను ఎదుర్కోవడం, జైలులో ఉండటం పార్టీ ఇమేజ్ ను భారీగా దెబ్బతీసిందనే ప్రచారం నాడు సాగింది. కవిత అరెస్ట్ అయిన సమయంలో పార్టీ నాయకత్వం ఆమెకు పూర్తిస్థాయిలో అండగా నిలబడలేదని, ఆమెను ఒంటరిని చేశారనే విమర్శలు వచ్చాయి. దీనిపై పార్టీ సరిగా స్పందించలేదని కవిత కూడా అలక వహించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. తర్వాత బెయిల్ పై బయటకు వచ్చిన కవిత, రాజకీయంగా వేరు కుంపటి పెట్టుకున్నట్లు కనిపిస్తున్నది. ఇటీవల కవిత తన తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్కు రాసిన లేఖ లీక్ కావడం తీవ్ర చర్చకు దారితీసింది. ఆ లేఖలో ఆమె పార్టీలో జరుగుతున్న అంతర్గత కుట్రలు, అవమానాలను ప్రస్తావించారని ప్రచారం జరిగింది. కవిత తాజాగా బీసీ రిజర్వేషన్ల సాధనపై సొంతంగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తుండటం, దీక్షలు చేపట్టడం కూడా పార్టీకి తలనొప్పిగా మారింది. ఆమె వైఖరి ఇప్పుడు స్వతంత్ర రాజకీయ అజెండాను సూచిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఈ సమస్య పార్టీకి మరింత ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని బీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నట్లు తెలిసింది.

### ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్



తెలంగాణలో వెలుగులోకి వచ్చిన ఫోన్ ట్యాపింగ్ కేసు సంచలనం సృష్టించింది. గత ప్రభుత్వం హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేరు ప్రముఖంగా వినిపించింది. కేసులో ఆయన పాత్రపై ఆరోపణలు వస్తుండడంతో, సిట్ అధికారులు ఆయన్ను అనేక దఫాలుగా విచారించారు. ఈ కేసులో ఇప్పటివరకు సిట్ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ కు చెందిన నాయకులు, మీడియా ప్రతినిధులు, వ్యాపారవేత్తలు సహా 200 మందికి పైగా బాధితుల వాంగ్మూలాలను నమోదు చేసింది. సుమారు 4,200 ఫోన్లు ట్యాప్ అయినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఈ కేసు విచారణ కూడా వేగవంతంగా జరుగుతున్నది. మరోవైపు బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్లో నిర్వహించిన ఫార్మూలా ఈరేసు కేసు కూడా నడుస్తూనే ఉంది. ప్రస్తుతం ఈ కేసు గురించి పెద్ద చర్చ లేనప్పటికీ మళ్లీ తెర మీదకు వస్తుంది.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు..
## 14 మందికి జరిమానా

అక్షర దర్బార్, పరకాల: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో సీతారాంపురానికి చెందిన పేర్వల రమేష్కు ఒకరోజు జైలు శిక్ష, రూ. 500 జరిమానా విధించినట్లు పరకాల సీఐ క్రాంతి కుమార్ తెలిపారు. ఈ నెల 3న పట్టుబడిన రమేష్‌ను గురువారం కోర్టులో ప్రవేశపెట్టగా శిక్ష పడిందన్నారు. అలాగే, మద్యం సేవించిన 14 మందికి జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సీఐ హెచ్చరించారు.

# అమ్మపాలే బిడ్డకు అమృతం: జయప్రద



అక్షర దర్బార్, చిట్యాల: తల్లిపాలే బిడ్డకు అమృతతుల్యమని, అనేక వ్యాధుల నుండి బిడ్డను కాపాడటానికి తల్లిపాలు దోహదపడతాయని ఐసీడీఎస్ సూపర్వైజర్ జయప్రద అన్నారు. గురువారం చిట్యాల సెక్టార్, క్రోసూర్ పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల ముగింపులో ఆమె మాట్లాడారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రపాలు పట్టాలని, ఆ పాలు అధికంగా వ్యాధినిరోధక శక్తిని కలిగి ఉంటాయని తెలిపారు. తల్లులు పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరు నెలల వరకు తల్లిపాలే ఇవ్వాలని సూచించారు.

# సేవల్లో నిర్లక్ష్యం వద్దు..
## ఇన్‌చార్జి కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో



అక్షర దర్బార్, ఇనుగుర్తి: పౌరులకు అందించే సేవల విషయంలో నిర్లక్ష్యం తగదని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. గురువారం ఇనుగుర్తి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎంపీడీవో, తహసిల్దార్ కార్యాలయాలు, ఫర్టిలైజర్ షాప్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్యం, విద్య, పోషకాహారం, పారిశుద్ధ్యం, రైతులకు నాణ్యమైన ఎరువులు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహాల్లో విద్యార్థినుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



# అమరుల త్యాగాలు వెలకట్టలేనివి
## రాజాసాహెబ్




అక్షర దర్బార్, దుగ్గొండి: పేదల కోసం పోరాడి ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి అని ఎంసీపీఐ (యు) డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజాసాహెబ్ అన్నారు. గురువారం రేబల్లె గ్రామంలో గటికె వీరస్వామి 34వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. దివంగత మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ నాయకత్వంలో అనేక ఉద్యమాలు చేసి ప్రజల మన్ననలు పొందిన వీరస్వామి త్యాగం నేటి తరానికి ఆదర్శమన్నారు. నాడు ఓంకార్‌తో పాటు కందికొండ సాంబయ్య, మేరుగు మల్లయ్య, కత్తి సాంబయ్య, సిరిబొమ్మల లక్ష్మీనారాయణ, పెండెం ఉప్పలయ్య, మాసపత్రి బాబు, కుమ్మరి కుంట్ల గణపతిలను నక్సలైట్లు హతమార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆశయ సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

# దాసరి మార్కండేయకు ఉత్తమ చేనేత కార్మిక అవార్డు




అక్షర దర్బార్, శాయంపేట: హన్మకొండ జిల్లాలో గురువారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవంలో శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన సీనియర్ చేనేత కార్మికుడు దాసరి మార్కండేయకు హన్మకొండ జిల్లా ఉత్తమ చేనేత కార్మిక అవార్డును అందజేశారు. చేనేత జౌళి సహాయ సంచాలకులు ఎం. విజయలక్ష్మి ఈ అవార్డును ప్రదానం చేశారు.

# స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం



అక్షర దర్బార్, దుగ్గొండి: అనారోగ్యంతో మృతి చెందిన చిన్ననాటి స్నేహితుని కుటుంబానికి ఆయన స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. గురువారం కింది బావికి చెందిన మాజీ సర్పంచ్ కూస సమత భర్త కూస రాజు మరణించగా, 1999-2000 పదవ తరగతి విద్యార్థులైన ఆయన చిన్ననాటి స్నేహితులంతా కలిసి రూ. 50,000/- ఆర్థిక సహాయం అందించారు.

# శ్రీ వేద పాఠశాలలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



అక్షర దర్బార్, పరకాల: శాయంపేట మండలం పెద్దకోడెపాకలోని శ్రీ వేద పాఠశాలలో గురువారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. హెచ్‌ఎం విజయ్ ఆధ్వర్యంలో విద్యార్థినులు, విద్యార్థులకు రాఖీలు కట్టి స్వీట్లు పంచుకున్నారు. బంధుత్వాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ వేడుకలు నిర్వహించినట్లు హెచ్‌ఎం తెలిపారు.

# నేను మోనార్కుని.. నన్నెవరేం చేయలేరు..!

- కాళేశ్వరం దేవస్థానంలో పాతుకుపోయిన ఆ ఉద్యోగి
- ప్రభుత్వాలు మారుతున్నా మారని ఉద్యోగి తీరు
- లడ్డూల తయారీలోనూ చేతివాటం ప్రదర్శన
- పుష్కరాల సమయంలో లడ్డూ విక్రయాల్లో గోల్ మాల్
- మాకందరికీ అన్నీ "మామూళ్ళే" నంటూ భింకం ప్రదర్శన
- చోద్యం చూస్తున్న దేవాదాయ ధర్మాదాయ ఉన్నతాధికారులు



అక్షరదర్బార్, కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరాలయంలో ఓ ఉద్యోగిపై వస్తున్న అవినీతి ఆరోపణలపై సర్వత్రా చర్చ జరుగుతుంది. గత 30 ఏళ్ళుగా ఆలయ ఉద్యోగి బాధ్యతల్లో పాతుకుపోయి వ్యవహరిస్తున్న తీరు పట్ల 'అక్షరదర్బార్' పత్రికలో వరుస కథనాలు వస్తుండగా ఎవరా ఆ ఉద్యోగి అంటూ భక్తులు ఆరా తీస్తున్నారు. పవిత్రమైన దేవాలయంలో ఆ ఉద్యోగి సాగిస్తున్న అపవిత్రమైన కార్యకలాపాల తీరుపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇవ్వన్నీ ఏ మాత్రం పట్టించుకోని సదరు ఉద్యోగి నేను మోనార్కునని, నన్నెవరేం చేయలేరంటూ రంకెలు వేస్తున్నట్లుగా సమాచారం. పైగా నేను లోకల్ అని, ప్రభుత్వంలోని పెద్దల అండదండలతో పాటు ఉన్నతాధికారుల సంపూర్ణ సహకారం నాకు మెండుగా ఉందని, ఇవన్నీ నాకు సిల్లీ థింగ్స్ అంటూ ప్రచారం చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అంతేకాకుండా తనపై మీడియాలో వచ్చే ఆరోపణలపై స్పందిస్తూ సెలబ్రిటీ మీదనే వార్తలు వస్తాయని నేనో సెలబ్రిటిని అంటూ లైట్ తీసుకుంటున్నట్లుగా ఇన్ఫర్మేషన్. ఇలా నా రూటే సెపరేట్ అంటూ ఒంటెద్దు పోకడకు పోతున్న సదరు ఉద్యోగి పట్ల దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు అవలంబిస్తున్న మెతక వైఖరిపై స్థానికంగా భిన్నాభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.

**లడ్డూ తయారీలోనూ ఉద్యోగి చేతివాటం**

కాళేశ్వరాలయంలో అన్నీ తానై ఉద్యోగాన్ని వెలగబెడుతున్న ఆ ఉద్యోగి ఆదాయం వచ్చే ఏ విభాగాన్ని వదులుకోడనే మంచి పేరు ఉంది. ఈ క్రమంలో లడ్డు తయారీ విభాగంపై తన కన్ను పడగా స్వలాభోపేక్ష కోసం ఒక సిస్టంనే తయారు చేసుకున్నట్లుగా తెలిసింది. అది ఎంతలా అంటే దేవుడి ప్రసాదంలోనే ఆదాయం మిగిలించుకునేలా మాస్టర్ ప్లాన్ రూపందించుకున్నట్లుగా సమాచారం. అసలు దేవాదాయ నిబంధనల ప్రకారం ఒక లడ్డు 100 గ్రాముల క్వాంటిటీతో తయారు చేయాల్సింది ఉండగా 90 గ్రాముల క్వాంటిటీతోనే లడ్డూలు తయారు చేయించి చేతివాటం ప్రదర్శించినట్లుగా ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల జరిగిన సరస్వతి పుష్కరాల్లో సుమారు 6 వేల లడ్డూలు గోల్ మాల్ కాగా ఆ అధికారి పాత్రపైనే అందరికీ అనుమానాలు వ్యక్తమయ్యాయి. కాగా సదరు ఉద్యోగి పరిచయిస్తులకు లడ్డూలు ఇవ్వడంతోనే ఆ 6 వేల లడ్డూలు కొరత పడ్డట్లుగా తెలిసినప్పటికినీ తనకున్న అధికార బలంతో ఆ పనిష్మెంట్ కాస్తా ఔట్ సోర్సింగ్ ఉద్యోగిపై నెపం నెట్టినట్లుగా సమాచారం. ఇలా లడ్డూల తయారీలోనూ ఉద్యోగి తన చేతివాటం ప్రదర్శిస్తుండగా క్వాలిటీ కంట్రోల్ అధికారులు సైతం మిన్నకుండిపోతున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**- మాకందరికీ అన్నీ 'మామూళ్ళే'**

కాళేశ్వరం దేవస్థానం సంబంధించిన అన్ని వ్యవహారాల్లో మాకందరికీ అన్నీ మామూళ్ళేనని సదరు ఉద్యోగి బాహాటంగానే చెబుతున్నట్లుగా సమాచారం. ప్రతీ పనిలో మాకో కమిట్మెంట్ ఉంటుందని, అందుకే తనకు అడ్డే ఉండదంటూ ఓపెన్ గా మాట్లాడుతుంటాడట. కాగా వీటినే నిజం చేసేలా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్న తీరు ఆ ఉద్యోగికి అండగా ఉన్నారనేదానికి నిదర్శనమని పలువురు ఆరోపిస్తున్నారు. ఇంతలా దక్షిణ కాశీగ పేరుగాంచిన ముక్తీశ్వరుడి సన్నిధానంలో సదరు ఉద్యోగి చేస్తున్న ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుండగా ఉన్నతాధికారులు మాత్రం మౌనం వీడకపోవడంపై ఆసక్తికర ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి.

# కేజీబీవీలు, హాస్టళ్ల నిర్వహణపై ఎమ్మెల్యే జీఎస్ఆర్ సమీక్ష

అక్షర దర్బార్, భూపాలపల్లి: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), హాస్టళ్లు, వసతి గృహాల నిర్వహణపై భూపాలపల్లి ఎమ్మెల్యే శ్రీ గండ్ర సత్యనారాయణ రావు గురువారం తన క్యాంప్ ఆఫీస్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు సరైన భోజనం, నీటి సదుపాయాలు, భద్రత, నర్సుల నియామకం వంటి అంశాలపై ఆయన కీలక సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదని స్పష్టం చేశారు. అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా విద్యా శాఖ అధికారి రాజేందర్ పాల్గొన్నారు.





# పోచమ్మ గుడిలో సౌకర్యాలు కల్పించాలి

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని పోచమ్మ దేవాలయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించాలని మాజీ కౌన్సిలర్ పోరండ్ల సంతోష్ మున్సిపల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. శ్రావణమాసంలో బోనాల జాతర ఘనంగా జరుగుతుందని, హైవే నుంచి గుడికి వెళ్లే ర్యాంపు సరిగా లేదని, వాహనదారులు, భక్తులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ర్యాంపు నిర్మించాలని, ఆలయం చుట్టూ లైట్లు, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరారు.

# జాతీయ అవార్డుకు జన్నె యుగేందర్ ఎంపిక



అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండలం, చిట్యాల వాసి జన్నె యుగేందర్ భారతీయ స్ఫూర్తి సేవారత్న నేషనల్ అవార్డు 2025కు ఎంపికయ్యారు. కళారంగంలో ఆయన చేసిన విశిష్ట సేవలు, సామాజిక అంశాలపై ప్రజలను చైతన్యపరచడం, తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడం వంటి కృషికి ఈ అవార్డు లభించిందని ఆసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ చైర్మన్ ఆకుల రమేష్ తెలిపారు. ఆగస్టు 30న హైదరాబాద్‌లో జరిగే జాతీయ సమావేశంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు.

# స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా రవీందర్ ఏకగ్రీవం

అక్షర దర్బార్, నర్సంపేట: దుగ్గొండి, నల్లబెల్లి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్‌ఐ) నూతన అధ్యక్షుడిగా జెడ్పీహెచ్ఎస్ మేడపల్లి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు గుండేటి రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన ఎన్నికల్లో ఆయన ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడికి ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915